క్లుప్తంగా

నేడు పలు మండలాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామ: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం పలు మండలాలలో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ దిబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చందాపురం 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో నందిగామ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలు, చందర్లపాడు, వీరులపాడు మండలాల పరిధిలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు

నందిగామ: ఏకాదశి మంగళవారం నేపథ్యంలో మండల పరిధిలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని గాం. దీనగర్ లో గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని కె.కంచ్రిక దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష పూజలతో పాటు ఆకు పూజ నిర్వహించారు. ఆయా ఆలయాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులపై ఆరా

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని పలు సంక్షేమ హాస్టళ్లను మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోపి నాయక్, షేక్ జాహిద, మాధవ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్‌ను సందర్శించిన న్యాయమూర్తి



నందిగామ: పట్టణంలోని భవిత డే కేర్ సెంటర్‌ను మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.తిరుమలరావు సందర్శించారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డేను పురస్కరించుకుని డే కేర్ సెంటర్‌ను సందర్శించిన ఆయన అక్కడ చిన్నారులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తి వెంట న్యాయవాదులు ఈశ్వర ప్రగడ రంగారావు, మట్టా ప్రసాద్, బొబ్బిళ్ళపాటి భాస్కరరావు, కొమ్మినేని మోశ్వేరరావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాయితీపై పుస్తకాల పంపిణీ



నందిగామ: సాంకేతిక విద్యలో ఉన్నత విద్యా ప్రమాణాలు నెలకొల్పే క్రమంలో డిప్లొమా చేసే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రాయితీపై అందజేసే పుస్తకాలను మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులను ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీకి సిద్ధం చేసేందుకు అవసరమైన పుస్తకాలను రాయితీపై అందజేస్తున్నామన్నారు. పలువురు విద్యార్థులకు 20 శాతం రాయితీపై పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీమతి పద్మ సుభాషిణి, రవీంద్రబాబు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నవాబుపేట పోస్టాఫీసులో నిధులు గోల్‌మాల్?

నవాబుపేట(పెనుగంచిప్రోలు):మండలంలోని నవాబుపేట బ్రాంచి పోస్టాఫీసులో నిధులు గోల్‌మాల్ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్లు, పోస్టల్ ఇన్సూరెన్స్, సేవింగ్స్ డిపాజిట్లను సిబ్బంది తమ ఖాతాల్లో డిపాజిట్ చేయకుండా వాడుకుంటున్నట్లు ఖాతాదారులు ఆందోళన చేస్తున్నారు. గతంలో కూడా పలుమార్లు ఈ విధంగా జరిగినా పోస్టల్ అధికారులు పట్టించుకోలేదని వాపోతున్నారు. దీనిపై నందిగామ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ దేవానంద్‌ను వివరణ కోరగా నిధులు గోల్‌మాల్ అయిన మాట నిజమేనని, ఎంత మేరకు జరిగిందనేది ప్రస్తుతం విచారణ చేస్తున్నామని అన్ని ఖాతాలు పరిశీలించాక నిర్ధారిస్తామని చెప్పారు.

మొర్సుమల్లి కోలాట బృందానికి ప్రథమ బహుమతి

మొర్సుమల్లి(మైలవరం): దసరా సాంస్కృతికోత్సవాలు సందర్భంగా విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో జరిగిన కోలాట పోటీలలో మొర్సుమల్లి శ్రీఆంజనేయ కోలాట సమాజం బృందం ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు గ్రూపు ఆర్గనైజర్ తెనాలి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సాంస్కృతికోత్సవాలు సందర్భంగా సోమవారం విజయవాడలో నిర్వహించిన ఈ పోటీలలో మొర్సుమల్లి శ్రీఆంజనేయ కోలాట సమాజం ప్రథమ బహుమతిగా రూ.20,000 అందుకున్నట్లు పేర్కొన్నారు.

వైద్యరంగ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం

- ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రభుత్వ విప్ ఉదయభాను



పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



తక్కెళ్లపాడులో మందులు పంపిణీ చేస్తున్న అధికారులు, వైద్యులు,ప్రజాప్రతినిధులు

జగ్గయ్యపేటఅర్బన్: పేద ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్యసేవలను తీసుకెళుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగ చరిత్రలోనే సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణంలోని 12,13,14 సచివాలయాల పరిధిలో గల ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వాస్పత్రిని రూ.3 కోట్లతో ఆధునీకరించి 30 నుంచి 50 పడకలకు పెంచడంతో పాటు మరొక రెండు ప్రభుత్వాస్పత్రులను అదనంగా ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలనందిస్తున్న ముఖ్యమంత్రిని ప్రజలందరూ మరొకసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. శిబిరంలో మొత్తం 720 మందికి వైద్య పరీక్షలు చేసి, జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్లు పాకలపాటి సుందరమ్మ, పండుల రోశయ్య, తన్నీరు నాగేంద్ర, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ మునిహేరా, డీసీహెచ్ఎం డాక్టర్ నాయక్, వైద్యులు షైల, రాజకుమార్, సీతారామ్, వినీల, సౌజన్య, హెచ్ఎం మాధవీలత పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతోనే నాణ్యమైన వైద్యం

కంచికచర్ల: జగనన్న ఆరోగ సురక్షతోనే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎంపీపీ షేక్ మలక్‌బషర్ అన్నారు. కంచికచర్ల మండలం మోగులూరు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మలక్‌బషీర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించటంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యంగా ఉండాలనే సీఎం ఆశయమన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి షేక్ మొయినుద్దీన్‌బీ, ఎంపీటీసీ సభ్యులు ఆవల సామ్రాజ్యం, మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, డీఎల్‌పీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, పీహెచ్‌సీ వైద్యులు, గ్రామ సచివాయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

తక్కెళ్లపాడు(జగ్గయ్యపేట): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఈవోపీఆర్డీ సాంబశివరావు అన్నారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో 380 మందికి వైద్య సేవలందించి మందులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట సర్పంచ్‌లు శ్రీనివాసరావు, రామకృష్ణ, వైద్యులు అనిల్‌కుమార్, స్రవంతి, కీర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బజారు సాయి, తమ్మవరపు వీరబాబు, ఆదిమళ్ల ముత్యాలు, సతీష్, వలంటీర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పరిటాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కంచికచర్ల: మండలంలోని పరిటాల–1 సచివాలయం పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

జయంతి గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష

జయంతి(వీరులపాడు): అనారోగ్య సమస్యలు పెద్దవై చికిత్సకు లొంగని దశకు చేరకుండా ముందుగానే గుర్తించి సరైన వైద్యమందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని జిల్లా ప్రోగ్రాం అధికారి మాధవి తెలిపారు. మండలంలోని జయంతి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు జంగా కోటిరెడ్డి, ఇప్పల కృష్ణారెడ్డి, వైద్యాధికారి దీపిక, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

నేడు శివాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని శివాపురం గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యం ప్రజలకు మరింత చేరువ

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు):జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే వీలు కలిగిందని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. స్థానిక సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏప్రభుత్వం కూడా వైద్యానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. శిబిరంలో మొత్తం 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా కమల, ఎంపీటీసీ సభ్యురాలు బారు సుధారాణి, గ్రామ నాయకులు పాన్నం కోటేశ్వరరావు, పాన్నం శివాజీ, నక్కా సుధాకర్, బెజవాడ శ్రీనివాసరావు, వైద్యులు పి.ఇందిర, సుజన, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మోగులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్



జయంతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి మాధవి



గుమ్మడిదూర్రులో రోగులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి, సర్పంచ్ కమల

ప్రతి ఒక్కరికీ అందుబాటులో మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులను అభివృద్ధి చేసి చేతులు దులుపుకోకుండా వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయించి నిరుపేదలకు వైద్యం అందించేందుకు బాధ్యతాయుతమైన పాత్ర పోషించారని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో ఇళ్ల వద్దకే వైద్యులు వచ్చి ప్రజలకు వైద్యమందిస్తున్నారని చెప్పారు. అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి పలు రకాల పరీక్షలు చేయటంతో పాటు ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పాకాలపాటి కిరణ్, ఓర్సు లక్ష్మి, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కమిషనర్ జయరాం, పలువురు నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దవరం జగనన్న సురక్ష శిబిరంలో మెడికల్ కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెద్దవరంలో...

మండలంలోని పెద్దవరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, సింగంశెట్టి మల్లికార్జునరావు, పలువురు నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెలదికొత్తపాలెంలో..

చందర్లపాడు మండలంలోని వెలదికొత్తపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ప్రారంభించారు. అనంతరం శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, చింతోటి ప్రసాద్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాణమే సీఎం జగన్ లక్ష్యం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పీటీకేపాలెం గడపగడపలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): కుల, వర్గ, మతతత్వాలు లేని సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం పాతబెల్లంకొండవారిపాలెం గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించటంతో పాటు కష్టకాలంలో అండగా నిలిచి ఆదుకోవటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో సైతం ఘన విజయాన్ని అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, బుగ్గినేని సురేష్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

ప్రభుత్వవిప్ ఉదయభాను



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న విప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. పెనుగంచిప్రోలు సచివాలయం–2 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించటంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడికక్కడే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా సాగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ మళ్లీ ఎప్పటిలాగానే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, వూట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు చాట్ల సుశీల, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చుంచు బెనర్జీ పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో ఆలయ అభివృద్ధి

పెనుగంచిప్రోలు: అందరి సహకారంతో తమ పదవీకాలంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయల నిధులతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పెనుగంచిప్రోలు ఆలయ కమిటీ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. స్థానిక శ్రీ తిరుపతమ్మ వారి ఆలయ పాలకవర్గ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చైర్మన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో రూ.15 కోట్ల వ్యయంతో ఆలయంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. డార్మెటరీ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.కోటి ఇవ్వటం తమకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. అధికారులు, పాలకవర్గం, భక్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. భవిష్యత్తులో ఆలయంలో మరింత అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కోలా రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ చెన్నకేశవరావు

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల గ్రామంలో ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఏడుకొండలు మంగళవారం తెలిపారు. హైదరాబాద్ అనూష ప్రాజెక్టు ప్రయివేటు లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు సివిల్ విద్యార్థులకు మౌఖిక పరీక్ష, రాత పరీక్ష నిర్వహించారని, మంచి ప్రతిభ కనపర్చిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికయిన విద్యార్థులకు కంపెనీ వార్షిక వేతనం రూ.2.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ముత్తవరపు శ్రీనివాసబాబు, ఏఓ ఎం.రామకృష్ణ, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో తెలంగాణ ఎన్నికల సందడి



తిరువూరు: తెలంగాణ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైన సందర్భంగా తిరువూరు నియోజకవర్గ పరిసరాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. తెలంగాణా పోలీసులు 24 గంటలూ ఈ చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పెనుబల్లి, కల్లూరు, మధిర, ఎర్రుపాలెం, వేంసూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆంధ్రా–తెలంగాణ సరిహద్దుల్లో ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ముత్తగూడెం వద్ద చెక్ పోస్టు వద్ద వాహనాలను కల్లూరు ఏసీపీ రామానుజం, రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు.

మాట ఇస్తే తప్పని నేత జగనన్న

పెనుగంచిప్రోలు: మాట ఇస్తే తప్పని నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. 1998 డీఎస్సీ ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు మంగళవారం మండల కేంద్రం పెనుగంచిప్రోలులో ఉదయభానును ఘనంగా సత్కరించారు. అనంతరం ఉద్యోగాలు పొందిన వారిలో చాలామంది పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తే ప్రభుత్వం నుంచి కొన్ని ఉపయోగాలు జరుగుతాయని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, వైస్ ఎంపీపీలు కనగాల శ్రీనివాసరావు, వాసు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు కొమరగిరి భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు.



విప్ ఉదయభానును సన్మానిస్తున్న 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

- కంచికచర్ల మండలంలో విద్యుత్‌శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు
- అధికలోడు వాడుతున్న 302 మందికి రూ.6.45 లక్షల జరిమానా



కంచికచర్లలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు

కంచికచర్ల: విద్యుత్‌ను అక్రమంగా వినియోగించినా, అధికంగా లోడు వాడినా కేసు నమోదు చేసి, అపరాధ రుసుం విధిస్తామని విద్యుత్‌శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు హెచ్చరించారు. కంచికచర్ల మండలంలోని మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఓసీ క్లబ్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. మీటర్లు లేకుండా అక్రమంగా విద్యుత్‌ను ఉపయోగించినా, లేదా విద్యుత్ చౌర్యానికి పాల్పడినా కేసు నమోదు చేస్తామన్నారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.ఆల్ఫోన్స్ పర్యవేక్షణలో మండలంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది 45 బృందాలుగా తనిఖీలు చేశారని చెప్పారు. ఈ తనిఖీలలో 302 మంది అధిక లోడు వినియోగించారని గుర్తించి, వారికి రూ.6.45 లక్షలు అపరాధ రుసుంగా విధించామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ కమలకుమారి, ఏడీ విజిలెన్స్ నవీన్‌కుమార్, విజయవాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం ఏడీఈ కొండలరావు, రెవెన్యూ అధికారి నాయుడు నరసింహారావు, ఏఈ వైవీ కృష్ణారావు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం ఏడీఏలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎల్‌హెచ్ఆర్ విద్యార్థులు



మైలవరం: రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కే కనకదుర్గ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఇన్‌చార్జి హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 9న విజయవాడ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన అండర్–19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఉమ్మడి కృష్ణా జట్ల ఎంపికలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వై.సందీప్, ఎం.కార్తీక్ సాఫ్ట బాల్, పి.సందీప్‌కుమార్, పి.విఘ్నేష్, టి.అఖిల్, బి.నాగచరణ్, డీహెచ్‌వీ సాయికుమార్ బేస్‌బాల్‌కు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. త్వరలో కడపలో జరిగే పోటీలకు కృష్ణాజిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ నెల 8వ తేదీన స్థానిక ఎస్ఎస్‌కే హైస్కూల్‌లో కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–18 జిల్లా జట్ల ఎంపికలో బి. మౌనిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 20 నుంచి చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.